తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

క్లుప్తంగా

విరాళం అందజేత

ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటలో రామాలయం, శివాలయాల నిర్మాణానికి గ్రామానికి చెందిన ఎలికట్టె విజయ్‌కుమార్, మధుసూదన్‌గౌడ్ తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా రూ.1,00,116లను ఆలయ కమిటీకి గురువారం అందజేశారు.

కల్వర్టు పనులు ప్రారంభం

గీసుకొండ : మండలంలోని చంద్రయ్యపల్లి-మనుగొండ గ్రామాల మధ్య కల్వర్టు నిర్మాణం పనులకు మోక్షం లభించింది. కాగా గురువారం సర్పంచ్ ఆకుల స్రవంతి, రుద్రప్రసాద్, ఉపసర్పంచ్ వేణు పనులను ప్రారంభించారు.

ట్రాక్టర్ యూనియన్ ఎన్నిక

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సుభాష్ చంద్రబోస్ ట్రాక్టర్ ఓనర్స్ యూనియన్ గ్రామ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొడిశాల మల్లయ్య, ఉపాధ్యక్షుడిగా చెందు, కోశాధికారిగా ఒంటరి క్రాంతిలను ఎన్నుకున్నారు. సభ్యులు సిద్ద జనార్దన్, వల్ల సదానందం, జయంత్, దిలీప్, తూటి శ్రీను, ఇస్లావత్ స్వామి, రొడ్డ రవి, రెడ్యా, కృష్ణ, శోభన్ తదితరులు ఉన్నారు.

జయప్రదం చేయాలి

చెన్నారావుపేట : నర్సంపేటలో ఈ నెల 4, 5, 6 తేదీలలో నిర్వహించే ఎంసీపీఐ(యూ) రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల నాయకుడు జన్ను రమేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో గురువారం ప్లీనరీకి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4న పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించి పాత రామ్‌రాజ్ టాకీస్ ఆవరణలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పండుగలా దశాబ్ది ఉత్సవాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : నియోజకవర్గ వ్యాప్తంగా దశాబ్ది ఉత్సవాలను పండుగలా నిర్వహించాలని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన ఫలాల ఆధారాలను తెలిపే ఫ్లెక్సీలు, కరపత్రాల రూపంలో ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేసి తెలిపేలా ఉత్సవాలు నిర్వహించాలన్నారు. ఉత్సవాల పండుగలో పార్టీ శ్రేణులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

పర్వతగిరి : రాష్ట్రవ్యాప్తంగా నేడు(శుక్రవారం) నుంచి తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చక్రాల సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో గురువారం దశాబ్ది ఉత్సవాల రివ్యూ సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జూన్ 3వ తేదీన తెలంగాణ రైతాంగ దినోత్సవాన్ని జరుకోవాలని మండల ప్రత్యేక అధికారి డీసీఓ సంజీవరెడ్డి సూచించారు.

ఏర్పాట్ల పరిశీలన

వర్ధన్నపేట : నియోజవర్గ కేంద్రంలో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకల ఏర్పాట్లను మున్సిపల్ చైర్ పర్సన్ అంగోత్ అరుణ, కమిషనర్ గొడిశాల రవీందర్ పరిశీలించారు. గురువారం పట్టణ కేంద్రంలోని రైతువేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలించారు.

నేడు ఊరూరా జాతీయ జెండావిష్కరణ

గీసుకొండ : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నేడు(శుక్రవారం) ఊరూరా జాతీయ జెండాల ఆవిష్కరణ చేపట్టనున్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

పర్వతగిరి : ఈ నెల 4వ తేదీన ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా నిర్వహించనున్న జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ బిర్రు మహేందర్ కోరారు. ఈ మేరకు మండలంలోని అన్నారంలో మాసాని గోపాల్ ఆధ్వర్యంలో గురువారం కరపత్రాలను ఆవిష్కరించారు.

'చలో హనుమకొండ' విజయవంతం చేయాలి

సంగెం : ఎస్సీ వర్గీకరణ కోసం నిర్వహించ తలపెట్టిన వరంగల్ ఉమ్మడి జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు కందికట్ల విజయ్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో చలో హనుమకొండ కరపత్రాలను ఆవిష్కరించారు. బిర్రు గోపాల్, నాయకులు సెగ్రెక్, స్వామి, మల్లేష్, అనిల్, భాస్కర్, రమేష్, కోర్నెలు, విరేష్, సునీల్ పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు ఎవరి కోసం?



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రజాపంథా నాయకులు

నర్సంపేట : దశాబ్ది ఉత్సవాలు ఎవరి కోసం నిర్వహిస్తున్నారని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నర్సంపేట డివిజన్ సహాయ కార్యదర్శి అద్దూరి రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు పట్టణంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో జూన్ 2నుంచి 12వ తేదీ వరకు తెలంగాణ ప్రజల ఆకాంక్ష దీక్షా దివస్ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని గురువారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ పాలనలో తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలు దగా పడ్డాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ఉద్యమ సమయం, ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. రాష్ట్రంలో రైతులను అనేక రకాల అవస్థలకు గురి చేస్తున్నారని అన్నారు. జూన్ 2నుంచి 12వ తేదీ వరకు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే తెలంగాణ ప్రజల ఆకాంక్ష దీక్షా దివస్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జవహర్‌లాల్, మనోహరచారి, రాజేందర్, శేషు, రవి, కమలాకర్, ఈర్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో అసమ్మతి రాగం



నర్సంపేట మున్సిపల్ కార్యాలయం

నర్సంపేట : నర్సంపేట మున్సిపాలిటీలో ముసలం మొదలైంది. అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు అసమ్మతి సెగలు రగిలించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజని భర్త కిషన్ తీరుపై బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కొంతకాలంగా అసంతృప్తితో ఉన్నట్లు బాహాటంగానే చర్చ జరుగుతోంది. అది కాస్త.. గురువారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో బట్టబయలైంది. పలువురు కౌన్సిలర్లు ఈ సమావేశానికి దూరంగా ఉండడంతో పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

అసలు కథేంటంటే?

నర్సంపేట మున్సిపాలిటీలో మొత్తం 24 మంది సభ్యులున్నారు. అధికార పార్టీకి చెందిన డివిజన్ కౌన్సిలర్ గుంటి రజనీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. ఆమె భర్త గుంటి కిషన్ తీరుపై అధికార పార్టీ కౌన్సిలర్లు కొంతకాలంగా అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. తమ అసమ్మతి తెలియజేసేందుకు సమయం కోసం వేచి చూస్తున్న కౌన్సిలర్లు గురువారం జరిగిన జనరల్ బాడీ సమావేశాన్ని వేదికగా చేసుకోవాలని నిశ్చయించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈమేరకు బుధవారం అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు 12మంది నర్సంపేటలో రహస్యంగా సమావేశం నిర్వహించుకున్నట్లు తెలుస్తోంది.

వాళ్లు లేరని వీళ్లు కూడా...

మొత్తం అధికార పార్టీ కౌన్సిలర్లలో 12మంది తమ అసంతృప్తిని వ్యక్తం చేసేందుకు హైదరాబాద్ వెళ్లారు. ఈవిషయం తెలుసుకున్న మిగతా కౌన్సిలర్లు గురువారం జనరల్ బాడీ సమావేశానికి డుమ్మా కొట్టినట్లు తెలుస్తోంది. మొత్తం అధికార పార్టీ కౌన్సిలర్లు 'గుంటి' సాకులతో గైర్హాజరు కావడంతో సమావేశం అసంతృప్తిగా ముగిసింది.

అసంతృప్తి అందుకేనా?

చైర్‌పర్సన్ గుంటి రజని భర్త గుంటి గుంటి కిషన్ తీరుపై అధికార పార్టీ కౌన్సిలర్ల అసమ్మతి రాగానికి ఆయన అనుసరిస్తున్న వైఖరే కారణమనే వాదనలు వినిపిస్తున్నాయి. పట్టణంలో ఏ కార్యక్రమం జరిగినా తన కనుసన్నల్లోనే జరగాలనే ఆదేశాలపై అసంతృప్తి ఉన్నట్లు తెలుస్తోంది. అంతే కాదు.. కౌన్సిలర్లు కార్యాలయానికి వచ్చిన సమాచారం కూడా తనకు కచ్చితంగా తెలిసి తీరాలని అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈవిషయంలోనూ అధికార పార్టీ కౌన్సిలర్లు గుర్రుగా ఉన్నట్లు సమాచారం. వాస్తవానికి మున్సిపల్ పరిధిలో ఎలాంటి కార్యక్రమం జరిగినా చైర్‌పర్సన్‌కు కచ్చితంగా సమాచారం ఇవ్వాల్సి ఉంటుందనే వాదనలు మరో పక్క వినిపిస్తున్నాయి.

సంక్షిప్త సమాచారం

వాహనాల తనిఖీ

నర్సంపేట రూరల్ : నంబర్ ప్లేట్ లేకుండా ప్రయాణం చేస్తే వాహనాలను సీజ్ చేస్తామని ఎస్సై సురేష్ నాయక్ అన్నారు. నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామ శివారు సెయింట్ మేరీ హైస్కూల్ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. అనంతరం సరైన పత్రాలు లేని వాహనాలకు, హెల్మెట్ లేని వారికి జరిమానా విధించారు. కార్యక్రమంలో ఎస్సై లక్ష్మి, పోలీస్ కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తరలించాలి

చెన్నారావుపేట : కొనుగోలు కేంద్రాల్లో కాంటా అయినా ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా తరలించాలని నెక్కొండ సీఐ హథీరాం అన్నారు. ఈ మేరకు మండలంలోని తిమ్మరాయినిపహాడ్ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని, జల్లీ శివారులోని రాధాకృష్ణ మిల్లును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. వర్షాకాలం సమీపిస్తోందని, రైతులు సొంత ట్రాక్టర్లతో ధాన్యాన్ని మిల్లులకు తరలించుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా ఉండి రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని ఆయన సూచించారు. ఎస్సై తోట మహేందర్, సిబ్బంది, రైతులు ఉన్నారు.

అభినందన

పర్వతగిరి : మే 28నుంచి 31వ తేదీ వరకు గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన సీఎం కప్ ఆర్చరీ టోర్నమెంట్‌లో మండలంలోని కల్లెడ ఆర్‌డీఎఫ్ ఆర్చరీ అకాడమీకి చెందిన ముగ్గురు క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో బి.గంగరాజు బాలుర విభాగంలో వెండి పతకంతో పాటు రూ.15వేల నగదు బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎ.జనార్దన్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కోచ్ చందులాల్, జయదాస్, ఏటయాకాంబ్రం, రాజు, శ్రీలత, శ్రీరామ్‌మూర్తి, భిక్షపతి, ముద్దుకర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి గంగరాజును అభినందించారు.

దళితరత్న అవార్డు అందజేత

సంగెం : మండలంలోని ఎల్గూర్‌రంగంపేట గ్రామానికి చెందిన బొమ్మల శంకర్ దళితరత్న అవార్డు అందుకున్నాడు. 15ఏళ్లుగా యువసంకల్ప అనే స్వచ్ఛంధ సంస్థను ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలను, రక్తదాన శిబిరాలను నిర్వహించాడు. సామాజిక సేవలో ముందున్న శంకర్‌ను గుర్తించి దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కల్వకుంట్ల కవిత కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ మేడ రాజీవ్ చేతుల మీదుగా దళిత రత్న అవార్డు అందజేశారు.

నర్సింహస్వామికి..

గీసుకొండ : గీసుకొండకు చెందిన మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి తుప్పరి నర్సింహస్వామికి దళితరత్న అవార్డు ప్రదానం చేశారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్, రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్‌ల ఆదేశాల మేరకు రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్‌సాగర్ ఈ అవార్డును అందించారు.

ప్రభాకర్‌కు జాతీయ విశిష్ట సేవారత్న..

నర్సంపేట: మండలంలోని గురిజాలకు చెందిన తెలంగాణ పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జేరిపోతుల ప్రభాకర్ జాతీయ విశిష్ట సేవారత్న అవార్డు అందుకున్నారు. ఎస్ఎస్‌బీఎం జాతీయ అధ్యక్షుడు కొంగర అనిల్, జాతీయ కార్యదర్శి యిర్మియాలు గోవాలో జరిగిన కార్యక్రమంలో ప్రభాకర్‌కు అవార్డును అందించారు.

వార్షికోత్సవ పూజలు

నెక్కొండ : బొడ్రాయి(గ్రామదేవత) ప్రథమ వార్షికోత్సవ పూజలు గురువారం సైతం కొనసాగాయి. రెండో రోజు ఉదయం నుంచి పూజ కార్యక్రమాలు మొదలయ్యాయి. పూజల్లో సర్పంచ్ దంపతులు సొంటిరెడ్డి యమునారెడ్డి-రంజిత్‌రెడ్డి, పూజారులు, తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శిపై ఫిర్యాదు

పర్వతగిరి : మండలంలోని ఇస్లావత్‌తండా గ్రామపంచాయతీ నిధులు తమకు తెలియకుండా స్వాహా చేశారని సర్పంచ్ రమేష్ అదే గ్రామపంచాయతీకి చెందిన పంచాయతీ కార్యదర్శిపై గురువారం ఎంపీఓ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశాడు.

నివాళి

నర్సంపేట : బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం తమ జీవితాలను అంకితం చేసిన అమరుల త్యాగాలు వృథా కావని ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని ఓంకార్ భవన్‌లో పాలం గోపాల్‌రెడ్డి వర్ధంతిని గురువారం డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజాసాహెబ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోపాల్‌రెడ్డి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వంగల రాగసుధ, మాశుక్, తదితరులు పాల్గొన్నారు.





'రైతుబంధు' విధానం అమలు చేయాలి



ఖానాపురం: 'గీతబంధు' పథకంలో 'రైతుబంధు' విధానాలు అమలు చేయాలని మోకుదెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల రమేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని ధర్మరావుపేటలో కంఠమహేశ్వరస్వామి, రేణుక ఎల్లమ్మ, వనం మైసమ్మ తల్లుల విగ్రహాల ప్రతిష్ఠాపన వద్ద గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇస్తున్నట్లుగా గీత కార్మికులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం చెల్లించాలన్నారు. గీత బీమా దరఖాస్తు ను ఈనెల 15 వరకు పెంచాలన్నారు. అబ్కారీ శాఖ నుంచి గుర్తింపు పొందిన ప్రతీ గీత కార్మి కుడికి గీత బీమా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు ఆనందం,సత్యం,రవికుమార్,రమేశ్, ప్రవీ ణ్‌కుమార్, జీవన్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



నల్లబెల్లి: ర్యాలీ ప్రారంభిస్తున్న సర్పంచ్ రాజారాం

ఖానాపురం : హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎంజీఎం ఆస్పత్రికి చెందిన ఔట్ రిచ్ వర్కర్ రాణి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఎయిడ్స్ గురించి ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఐసీటీసీలో హెచ్‌ఐవీ రక్త పరీక్షలు చేయించుకోవాలని, పరీక్షల్లో పాజిటివ్‌గా తేలితే ఏఆర్టీ మందులు వాడాలని సూచించారు. ఏరియా ఆస్పత్రి ఐసీటీసీ బాధ్యులు రవీందర్, ఏఎన్ఎం రాగం సునీత, ఆశ సునీత, కవిత పాల్గొన్నారు.

నల్లబెల్లిలో..

నల్లబెల్లి : ఎయిడ్స్‌పై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నానబోయిన రాజారాం అన్నారు. సంపూర్ణ సురక్ష హెచ్‌ఐవీ, ఎయిడ్స్ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ స్కీం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో మానవహారం నిర్వహించారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

నెక్కొండ : చెరువు శిఖం, ప్రభుత్వ, అసైన్డ్ భూముల అక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని తహసీల్దార్ డీఎస్. వెంకన్న హెచ్చరించారు. మండలంలోని చంద్రుగొండ, గేటుపల్లి గ్రామస్తులు, మూడు తండాకు చెందిన గిరిజన రైతుల ఫిర్యాదు మేరకు గురువారం చంద్రుగొండ పెద్ద చెరువు ఐబీ డీఈ సంతోష్‌తో కలిసి విచారణ చేపట్టారు. ఈ క్రమంలో బీజేపీ నాయకులు సంఘటన స్థలికి చేరుకొని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు గటిక అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. రైతులకు న్యాయం జరిగే వరకు ఆందోళన చేపడుతామన్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. అన్నదాతలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వారం రోజుల్లో పూర్తిస్థాయిలో విచారణ చేసి, రిపోర్టును ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు. ఆర్ఐ నరేందర్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు కక్కెర్ల నాగయ్య, అంబాల రాంగోపాల్, మూసిన మాధవ్, రైతులు బాదావత్ బిచ్చా, బానోత్ వెంకట్రాం, అజ్మీరా రూప్లా, ధర్మా, మంగ్యా, బానోత్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.











